బలగం
BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 15 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 5


## రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



దక్షిణ ఒడిశా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, అన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## తెలంగాణ రైజింగ్‌లో
# సినీ రంగానికి ప్రాధాన్యం



- హాలీవుడ్, బాలీవుడ్ కాదు.. హైదరాబాద్ అని చెప్పుకోవాలి
- తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో పరిశ్రమకీ ప్రాధాన్యత
- ప్రభుత్వ నిర్ణయాలు కఠినంగా కనిపిస్తాయి కానీ ప్రభుత్వం సినిమా రంగాన్ని అభిమానంగా చూస్తుంది
- సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ హైటెక్స్‌లో వైభవంగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా అవార్డుల అందజేత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరాన్ని హాలీవుడ్, బాలీవుడ్ సినిమా పరిశ్రమకు అడ్డాగా మార్చడానికి ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమ రాణించడానికి నిర్దేశిత లక్ష్యాలతో ఒక చాప్టర్ ఉండాలని, అందుకు సినీ ప్రముఖులు అవసరమైన ప్రణాళికను తయారు చేయాలని కోరారు.హైదరాబాద్ హైటెక్స్‌లో కన్నుల పండుగగా సాగిన ప్రతిష్టాత్మక "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2024" ప్రదానోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "స్వాతంత్రం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న 2047 నాటికి దేశం ఆర్థికంగా బలోపేతం కావాలంటే సినిమా రంగం కూడా ఒక పరిశ్రమగా రాణించాలి. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, వచ్చే 10 ఏళ్ల నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించాలంటే సినీ పరిశ్రమ కూడా అభివృద్ధి సాధించాలి. సినిమా రంగం అభివృద్ధి సాధించడానికి పరిశ్రమకు ఏం కావాలో చెప్పండి. ఏ హోదాలో ఉన్నా మీకు అండగా నిలబడుతా. అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణకు ఎవరైనా రావొచ్చు. ఎవరైనా వాణిజ్యం నిర్వహించవచ్చు. 500 ఫార్చ్యూన్ కంపెనీల్లో 85 కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ప్రపంచ నగరాలతో పోటీ పడదలచుకున్నాం.

తెలుగు సినీ పరిశ్రమలను గుర్తించడానికి 1964 లో ఈ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించి అప్పటి నుంచి 2014 వరకు నిరాటంకంగా నిర్వహించారు. వివిధ కారణాల చేత 14 ఏళ్ల కిందట ఆగిపోయిన సినిమా అవార్డుల ప్రదానోత్సవాన్ని పునరుద్ధరించాలని దిల్‌రాజు ప్రతిపాదించారు. వాటిని పునరుద్ధరించడమే కాకుండా గడిచిన పదేండ్ల కాలంలో ప్రతిభ కనబరిచిన అందరినీ అభినందించాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. అందుకు సహకరించిన సినీ రంగానికి అభినందనలు. కొన్ని అంశాల్లో ప్రభుత్వ నిర్ణయాలు కఠినంగా కనిపిస్తాయి. కానీ ప్రభుత్వం సినిమా రంగాన్ని అభిమానంగా చూస్తుంది. ఇప్పుడే కాదు గతంలోనూ మా ప్రభుత్వాలు సినిమా రంగాన్ని గౌరవించింది. ఇంత అద్భుతమైన కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వహకులకు, అందుకు సహకరించిన సినీ రంగ ప్రముఖులందరికీ అభినందనలు.

గద్దరన్న స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. అందరం కలిసికట్టుగా తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలి. తెలంగాణను అభివృద్ధి వైపు నడిపించడంలో కళా చైతన్యం తోడుగా నిలవాలి.." అని ముఖ్యమంత్రి గారు కోరారు. 014 నుంచి 2024 వరకు ప్రతి ఏటా ఆయా కేటగిరీల్లో ఎంపికైనా ఉత్తమ చిత్రాలతో పాటు నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సంగీత, సాహిత్యకారులు, సాంకేతిక నిపుణులు, చిత్రపరిశ్రమలో విశేష కృషి చేసిన ప్రముఖులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా గద్దర్ అవార్డులు అందజేశారు.



## టెస్ట్ ఛాంపియన్స్‌గా దక్షిణాఫ్రికా

- వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై ఘన విజయం
- 5 వికెట్ల తేడాతో గెలుపు
- 27 ఏండ్ల తర్వాత

వివరాలు 4వ పేజీలో

## విమాన ప్రమాదంపై విచారణకు కమిటీ



- ఐదుగురు సభ్యులతో కమిటీ
- మూడు నెలల్లో నివేదిక
- విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది
- మృతదేహాలను వీలైనంత తొందరగా అందజేస్తాం
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విమాన దుర్ఘటనను పౌరవిమాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీ వేశామని, అవసరమైతే మరికొంతమంది సభ్యులనూ బృందంలో చేరుస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. డీఎన్ఏ పరీక్షలు వేగంగా జరుగుతున్నాయనీ, మృతదేహాలను వీలైనంత తొందరగా అందజేస్తామని తెలిపారు. ఎయిర్‌సేఫ్టీపై శనివారం నాడిక్కడ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విమాన ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే ప్రమాదం జరిగిందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు రెండు కిలోమీటర్ల దూరంలో 650 అడుగుల ఎత్తులో విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో పైలట్ మేడే కాల్ చేశారని అన్నారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖ సంయుక్తంగా స్పందించాయని తెలిపారు. అదే విధంగా ఘటనా స్థలంలో వెంటనే మంటలను ఆర్పి మృతదేహాలను అక్కడి నుంచి తరలించామని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బ్లాక్‌బాక్స్ దొరికిందని తెలిపారు. దీన్ని డీకోడ్ చేసిన తరువాత మరింత సమాచారం తెలుస్తుందని పేర్కొన్నారు.

ఈ ప్రమాదంపై హోం శాఖ సెక్రెటరీ అధ్యక్షతన హైలెవల్ కమిటీతో దర్యాప్తు చేయిస్తున్నామని అన్నారు. ప్రత్యేక అధికారులతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఈ కమిటీలో ఉన్నారని చెప్పారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రెటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్టు చెప్పారు. నిపుణుల దర్యాప్తు పూర్తయిన వెంటనే మీడియాకు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. మూడు నెలల్లో ప్రమాదంపై కమిటీ నివేదిక అందజేస్తుందని భావిస్తున్నామని అన్నారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే బోయింగ్ 787 సిరీస్ విమానాల భద్రతపై దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. ప్రస్తుతం 34 బోయింగ్-787 విమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఏడు విమానాల భద్రతపై సమీక్ష జరిగిందని చెప్పారు. అంతేకాకుండా ఈ సిరీస్‌ను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు.

"ఈ విమాన ప్రమాదం నన్ను ఎంతో షాక్‌కు గురిచేసింది. రోడ్డు ప్రమాదంలో నా తండ్రిని కోల్పోయా. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. రెండు రోజులుగా బాధలో ఉన్నాను" అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. బాధిత కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించారు. వారికి అండగా ఉంటామని తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిది ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదమని పేర్కొన్నారు. హై లెవెల్ కమిటీతో సోమవారం (జూన్ 16) భేటీ అవనున్నట్టు తెలిపారు. గడిచిన 48 గంటల నుంచి ప్రజలకు అన్ని విషయాలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## బనకచెర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం



- నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రెజెంటేషన్ ఇచ్చిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు..


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ భవన్‌లో శనివారం (జూన్ 14) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతల సమక్షంలో నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రెజెంటేషన్ ఇచ్చిన సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు.. బీజేపీ, కాంగ్రెస్ ల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బనకచెర్ల ప్రాజెక్టుతో తెలంగాణ నష్టం జరుగుతుందని తెలిపారు. దీనిని వ్యతిరేకించేందుకు సత్వరమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బనకచెర్ల ప్రాజెక్టుకు సెంట్రల్ వాటర్ కమిషన్ , గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు లేదా అపెక్స్ కౌన్సిల్ నుండి ఎలాంటి అనుమతులు లేవని హరీష్ రావు పేర్కొన్నారు. అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తుండటాన్ని ఆయన ఖండించారు. దీనిపై కాంగ్రెస్, బీజేపీ మౌనంగా ఉండటాన్ని తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ చివర్లో టెండర్లు పిలిచి, జూలైలో పనులు ప్రారంభించాలనే ఉద్దేశంతో ఉందని ఆరోపించిన హరీష్ రావు.. కేంద్రం దీనిని అంగీకరించడం అన్యాయమన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, తెలంగాణపై ఎఫ్ఆర్ఎంబీ రుణ పరిమితుల విషయంలో నిరాకరణ చూపించి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు బనకచెర్ల ప్రాజెక్టుకు 50 శాతం నిధులు మంజూరు చేయడం దారుణమని విమర్శించారు. అంతేకాక, రూ. 40,000 కోట్లు అదనంగా %ఖీక్ష్మదీవీ% రుణంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నుంచి 400 టీఎంసీలు నీరు వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుండటాన్ని ఆయన ప్రశ్నించారు. అంతేకాదు, శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నా, సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడాన్ని హరీష్ రావు తప్పుబట్టారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా ఏపీ రోజుకు 90,000 క్యూసెక్కుల నీరు తీసుకునేలా మారుతుందని హెచ్చరించారు. దీంతో 8 టీఎంసీలు అదనంగా వాడుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి గోదావరి జలాల వినియోగాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని హరీష్ రావు అన్నారు. కళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు వెంటనే చేపట్టాలంటూ ఆయన పిలుపునిచ్చారు. "రాష్ట్ర ప్రయోజనాలపై రాజీ పడకుండా రేవంత్ రెడ్డి స్పందించాలని కోరుతున్నా" అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లను కూడా ఈ విషయాన్ని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## నీట్ యూజీ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా 22లక్షల 9వేల 318 మంది పరీక్షలు రాయగా12లక్షల 36వేల 531 మంది అర్హత సాధించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ అలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్‌కు రెండో ర్యాంక్, మహారాష్ట్రకు చెందిన కృషంగ్ జోషికి మూడో ర్యాంక్ వచ్చింది. దిల్లీకి చెందిన అవికా అగర్వాల్‌కు మహిళల విభాగంలో తొలి ర్యాంకు దక్కింది. అలాగే ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సత్తాచాటారు. తెలంగాణ నుంచి 41వేల 584 మంది విద్యార్థులు, ఏపీ నుంచి 36వేల 776 మంది విద్యార్థులు అర్హత సాధించారు. తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయి కుమార్‌కు 18వ ర్యాంకు వచ్చింది. ఏపీకి చెందిన దర్భా కార్తీక్‌రామ్‌కు 19వ ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన షణ్ముఖ్ నిషాంత్‌కు 37, మంగారి వరుణ్‌కు 46, యంద్రపాటి షణ్ముక్‌కు 48వ ర్యాంకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు కొడవటి మోహిత్ శ్రీరామ్‌కు 56వ ర్యాంకు, దేసిన సూర్యచరణ్‌కు 59, పొదిలపు అవినాశ్‌కు 64వ ర్యాంకు, యత్రా సమీర్‌కుమార్‌కు 70వ ర్యాంకు వచ్చింది.తుమ్మూరి శివ మణిదీప్‌కు 92వ ర్యాంకు దక్కింది. తెలంగాణకు చెందిన బిదీష మాఝి 95వ ర్యాంక్ సాధించింది. విద్యార్థుల ఈ-మెయిల్‌కు స్కోర్‌కార్డులు పంపుతున్నారు. విద్యార్థులు వ్యక్తిగత లాగిన్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం కల్పించారు.

## 'బనకచర్ల -గోదావరి పీఎఫ్ఆర్‌ను తిరస్కరించండి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బనకచర్ల గోదావరి ప్రాజెక్టుకు సంబంధించి అప్పటికే పీఎఫ్ఆర్ ఆమోదించినట్లు భావించాల్సి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించడం అంటే కేంద్ర జల వనరుల సంఘం ఆమోదించినట్లు అవుతుందా? అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుతనాన్ని అడ్డు పెట్టుకుని ప్రాజెక్ట్ కోసం కేంద్రాన్ని నిధుల కోసం ఒత్తిడి చేసిన అంశాన్ని 22జనవరి 2025న కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తో పాటు ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖ రాసిన సందర్భన్నీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

'బనకచర్ల -గోదావరి పీఎఫ్ఆర్‌ను తిరస్కరించండి. డీపీఆర్ నివరించండి...టెండర్లు తక్షణమే నిలిపి వేయండి'అంటూ కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫీజుబిలిటి రిపోర్ట్(పి.ఎఫ్.ఆర్) ను తక్షణమే తిరస్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్‌ను అడ్డు కోవడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను నిలువరించాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ కు శనివారం రోజున బహిరంగ లేఖ రాశారు. 1980 లో గోదావరి జలాల ఒప్పందాన్నీ ఉల్లంఘించినట్లు అవుతుందని, గోదావరి జల వివాద ట్రిబ్యునల్ ను పరిగణనలోకి తీసుకోవడం తో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణా కు దక్కాల్సిన గోదావరి నది వాటా హక్కును ప్రత్యక్షంగా దిక్కరించడమే అవుతుంది. ఈ సంవత్సరం జూన్ 2 న నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ యాదవ్ చేసిన సూచన ఇందుకు అద్దం పడుతోంది అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

బనకచర్ల గోదావరి ప్రాజెక్టుకు సంబంధించి అప్పటికే పీఎఫ్ఆర్ ఆమోదించినట్లు భావించాల్సి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించడం అంటే కేంద్ర జల వనరుల సంఘం ఆమోదించినట్లు అవుతుందా? అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుతనాన్ని అడ్డు పెట్టుకుని ప్రాజెక్ట్ కోసం కేంద్రాన్ని నిధుల కోసం ఒత్తిడి చేసిన అంశాన్ని 22జనవరి 2025న కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తో పాటు ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖ రాసిన సందర్భన్నీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు కోసం 2024, నవంబర్ 15న..డిసెంబర్ 29న కేంద్రప్రభుత్వాన్ని ఆశ్రయించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మొత్తం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ. 80,113 కోట్లు కాగా గోదావరి నుండి కృష్ణా వరకు రూ.13,511 కోట్లు అవుతుందని కృష్ణా నుండి బొల్లపల్లి రిజర్వాయర్‌కు రూ.28,560 కోట్లు ఖర్చు అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ లేఖలో వివరించారు. అదే విధంగా బోళ్లపల్లి నుండి బనకచర్ల హెడ్ రెగ్యులెటరీకీ రూ. 38,041 కోట్లు ఖర్చు అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

కేంద్ర జలవనరుల కమిషన్ తో పాటు గోదావరి-కృష్ణా నది బోర్డులు 9 ఏపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగింది అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆధార్ కార్డుకు సంబంధించిన వివరాల అప్‌డేట్‌కు గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) మరోసారి పొడిగించింది. ఆధార్‌లో డాక్యుమెంట్లను ఉచితంగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు గడువు జూన్ 14న ముగియాల్సి ఉండగా యూఐడీఏఐ ఈ సదుపాయాన్ని మరో ఏడాది పాటు అంటే 2026 జూన్ 14 వరకు పొడిగించింది. ఈ మేరకు 'ఎక్స్'(ట్విటర్) ద్వారా యూఐడీఏఐ వెల్లడించింది.

ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపుతో కోట్లాది మంది ఆధార్ కార్డుదారులకు ఉపశమనం కలగనుంది. ఈ ఉచిత సేవ మై ఆధార్ పోర్టల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. పదేళ్ల క్రితం ఆధార్ చేయించుకుని ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోని వారు ఆధార్ అప్‌డేట్ చేయాలని యూఐడీఏఐ కోరింది. వివాహం, బదిలీ లేదా ఇతర కారణాల వల్ల పేరు, చిరునామా లేదా మరేదైనా సమాచారం మారితే అప్‌డేట్ చేసుకునేందుకు ఈ సదుపాయం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో ఈ ఆన్‌లైన్ సర్వీసుకు రూ.50 ఫీజు వసూలు చేసేవారు. డిజిటల్ మార్గాల ద్వారా డాక్యుమెంట్ అప్‌డేట్‌ను ప్రోత్సహించడానికి యూఐడీఏఐ ఈ ఛార్జీని తొలగించింది. అయితే ఫిజికల్ ఆధార్ అప్‌డేట్ సెంటర్లలో చేసే అప్‌డేట్‌కు మాత్రం ఇంకా రుసుం వసూలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ చేసుకోండిలా..

యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్ ( https://myaadhaar.uidai.gov.in ) సందర్శించండి.

ఆధార్ నెంబర్, ఓటీపీతో లాగిన్ అవ్వండి.

సమాచారాన్ని సరిచూసుకుని 'ఐ వెరిఫై...'పై క్లిక్ చేయండి.

ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ ఎంచుకుని 2ఎంబీ కంటే తక్కువ పరిమాణంలో (JPEG/PNG/PDF) డాక్యుమెంట్ కాపీని అప్‌లోడ్ చేయండి.


డాక్యుమెంట్ ఆఫ్ అడ్రస్ సెలెక్ట్ చేసి డాక్యుమెంట్ కాపీని అప్‌లోడ్ చేయాలి.

అగ్రీ అండ్ సబ్మిట్‌పై క్లిక్ చేయండి.

రసీదును డౌన్ లోడ్ చేసుకోండి.

## ఇజ్రాయెల్-ఇరాన్ భీకర దాడులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం భీకరంగా మారుతున్నది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇజ్రాయెల్ చేసిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. శనివారం ఉదయం ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు మరణించగా, డజన్లకొద్దీ పౌరులు గాయపడ్డారు. టెల్ అవీవ్, జెరూసలేం నగరాలు లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది. పలుచోట్ల భారీగా ఆస్తి నష్టం సంభవించింది. తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను టెల్ అవీవ్‌పైకి పంపిన ఇరాన్.. ఆ తర్వాత వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. అంతకుముందు రోజు ఇజ్రాయెల్ రెండు దఫాలుగా ఇరాన్‌లోని సుమారు 300 లక్ష్యాలపై దాడులు చేసింది. ఇరాన్‌లోని అణు స్థావరాలు, మిలిటరీ కేంద్రాలు లక్ష్యంగా ఈ దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతోపాటు, డ్రోన్లను కూడా ఉపయోగించింది. ఇజ్రాయెల్ దాడుల్లో 78 మంది మరణించారని, 320 మంది గాయపడ్డారని ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి వెల్లడించారు. మృతుల్లో పలువురు ఉన్నత సైన్యాధికారులు, అణుశాస్త్రవేత్తలు ఉన్నట్టు తెలిపారు. శనివారం కూడా ఇజ్రాయెల్ పలుమార్లు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు చేసినట్టు ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. బోరుజెర్డ్‌లోని కార్ల తయారీ కంపెనీ, ఖుజెస్థాన్ ప్రావిన్స్‌లోని అబాదాన్‌లో పేలుళ్లు సంభవించినట్టు పేర్కొంది. కెర్మాన్‌షాలోని మిలిటరీ బరాక్స్ వద్ద కూడా దాడులు జరిగినట్టు తెలిపింది. ఇరాన్ దాడుల్లో తమ ఏడుగురు సైనికులు గాయపడ్డారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇజ్రాయెల్‌లోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం కూడా మూసివేశారు.తమ దేశంపై క్షిపణి దాడులు కొనసాగిస్తే టె హ్రాన్ తగలబడు తుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరించారు.

# కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలి


**-గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసినవారు తిరిగి స్వంత గూటికి రావాలి**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..శనివారం వేములవాడ పట్టణంలోని తాటి కొండ రాజయ్య ఫంక్షన్ హాల్ లో వేములవాడ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్ 200 మందితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా,వారికి ప్రభుత్వ విప్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్ననని అన్నారు..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టి పేద ప్రజలకు అనేక పథకాలను రూపకల్పన చేసిందని తెలిపారు.. కొత్త పాత అనే తేడా లేకుండా కలసిగట్టుగా పని చేస్తు ముందుకు పోవాలన్నారు.



ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వాలు పేద ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడ అమలు చేయలేదన్నారు.అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం అన్నారు..గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి వేర పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని వారందరు తిరిగి స్వంత గూటికి రావాలని పిలపునిచ్చారు. చేరిన వారిలో కాముటాల వేణు,కముటల రాజు, తాటికిండ అనిల్, ఎర్రబెల్లి రాజశేఖర్, వంగర కిరణ్ ఉన్నారు..ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజ్యం, కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కాచ్చకాయల ఎల్లయ్య,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధైత కుమార్, కృష్ణ, నాగరాజు, తోట రాజు పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లహరి, నాయకులు,కూరగాయల కొమురయ్య,బింగి మహేష్,పుల్కమ్ రాజు, గూడూరి మధు, పాత సత్యలక్ష్మి,ఫిర్ మహ్మద్,భాశెట్టి రవీందర్,పులి రాంబాబు, ఇప్పపుల అజయ్, ముకుంద రెడ్డి,ఎర్ర శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, కార్యకర్తలు తదితరాలు ఉన్నారు.



## తెలంగాణ జాగృతిలోకి భారీగా విద్యార్థి నాయకులు..

- **ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ జాగృతిలోకి పెద్ద ఎత్తున విద్యార్థి నాయకులు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి తెలంగాణ జాగృతిలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందుండి పోరాడారని, కీలక పాత్ర పోషించారని కవిత గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో కూడా విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని ఆమె కోరారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. కర్ణాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్ధరామయ్యకు తాను నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అబద్ధమని కవిత దుయ్యబట్టారు. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫోటో విడుదల చేసిందని, ఆ ఫోటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని కానీ రేవంత్ రెడ్డి మాత్రం లేరని ఆమె ఎత్తి చూపారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్ధాలు ఆడుతున్నారో అర్థమవుతోందని అన్నారు.

రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారని, దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని కవిత సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని, జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని, కానీ చేస్తున్న జాబ్ లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని, కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండే అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. దాదాపు 8 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రైతు భరోసా, పంటల బీమా వెంటనే అమలు చేయాలి..



**-సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. సాగర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో, రైతు భరోసా పథకాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. సాగర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన జిల్లా రాజకీయ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఎకరానికి రూ. 7,500 రైతు భరోసా ఇస్తామని చెప్పి, దానిని రూ. 6,000లకు తగ్గించిందని విమర్శించారు. అంతేకాకుండా, 2024 వానాకాలం సీజన్‌కు ఈ పథకాన్ని వర్తింపజేయలేదని, 2025 యాసంగిలో కూడా 53.4 లక్షల మంది రైతులకు రూ. 4,366 కోట్లు మాత్రమే చెల్లించారని గుర్తుచేశారు. 2025-26 వానాకాలం ప్రారంభమైనందున, 70 లక్షల మంది రైతులకు రూ. 7,320 కోట్లు రైతు భరోసా కింద తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అత్యవసరం అని నొక్కి చెప్పారు. రైతు బీమా పథకం ప్రస్తుతం 18-59 సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులకు మాత్రమే రూ. 5 లక్షల బీమా వర్తింపజేస్తోందని, దీనివల్ల వందల కోట్ల రూపాయల ప్రీమియం కంపెనీలకు లాభాలుగా వెళ్తున్నాయని సాగర్ ఆరోపించారు. 2024-25లో 42.16 లక్షల మందికి రూ. 1,433.33 కోట్లు ప్రీమియం చెల్లించగా, కేవలం 12,355 మందికి రూ. 616.75 కోట్లు మాత్రమే పరిహారం అందిందని గణాంకాలు ఉదహరించారు. ప్రభుత్వమే ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ ప్రీమియంతోనే రైతులకు బీమా సౌకర్యం కల్పించవచ్చని సూచించారు. రైతు బీమా వయస్సును 18-65 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ విత్తనోత్పత్తి రాష్ట్రంగా ఉన్నప్పటికీ, విత్తన చట్టం లేకపోవడం వల్ల రైతులు ఏటా 5-6 లక్షల ఎకరాల్లో నాణ్యత లేని విత్తనాల వల్ల పంట నష్టపోతున్నారని సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 444 విత్తన కంపెనీలు, 467 సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నప్పటికీ, వ్యవసాయ శాఖ వాటిని నియంత్రించలేకపోతోందని విమర్శించారు. 2014-22 మధ్య 991 కల్తీ విత్తన కేసుల్లో 1932 మందిపై కేసులు పెట్టినా, ఏటా కల్తీ వ్యాపారం కొనసాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, మల్లారపు అరుణ్ కుమార్, జవ్వాజి విమల, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, అన్నల్దాస్ గణేష్, మల్లార ప్రశాంత్, గురజాల శ్రీధర్, సూరం పద్మ, రమేష్ చంద్ర, సిపిఎం నాయకులు రామంచ అశోక్, గీస బిక్షపతి, నక్క దేవదాస్, మల్యాల నరసయ్య, సామలపల్లి రాములు, మనోజ్, సిరిమల సత్యం, ఎలిగేటి శ్రీనివాస్, ఉడుత రవి, బెజిగం సురేష్, బండి శీను తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమ చరిత్ర పాఠ్యాంశం తొలగింపుపై బీఆర్ఎస్వీ నిరసన..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పదో తరగతి పాఠ్యపుస్తకాల నుంచి తెలంగాణ ఉద్యమ చరిత్రను తొలగించడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. ఈ నిర్ణయానికి నిరసనగా సిరిసిల్ల లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సబ్బని హరీష్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇలాంటి నీచమైన చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఎన్ని చిల్లర పనులు చేసినా తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పాత్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. దశాబ్దాల కాలం తెలంగాణ ప్రజలు ఉద్యోగాలు, సాగునీరు, అనేక రంగాల్లో అవమానాలు, అణచివేతకు గురై ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. అలాంటి చరిత్రను భావితరాలకు తెలియజేయడం మన బాధ్యత అని అన్నారు. ఎంతో మంది విద్యార్థులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, తెలంగాణ వస్తే తమ తరాలు బాగుపడతాయని ప్రాణాలు త్యాగం చేశారని హరీష్ పేర్కొన్నారు. అలాంటి గొప్ప ఉద్యమ చరిత్రను తుడిచివేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర చరిత్రలో ఏనాడూ, ఎక్కడా ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని రకాలుగా వక్రీకరించినా, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ తెలంగాణ ద్రోహిగానే మిగులుతుందని, తెలంగాణ రాష్ట్రం ఏనాటికీ దీనిని మరచిపోదని అన్నారు. పాఠ్యాంశం తొలగింపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని సబ్బని హరీష్ స్పష్టం చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించి పాఠ్యాంశాన్ని తిరిగి చేర్చేలా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇంచార్జ్ ఎస్.కే. బాబా, మెట్టల సాయి దీపక్, వలబోజు వెంకటరమణ, అశ్వాక్, భరత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ ను రద్దు చేయాల్సిందే : ఎమ్మెల్యే కూనంనేని

**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కలలు కంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కమ్యూనిస్టుల మృతదేహాలను చూసి కేంద్రం భయపడుతోందని, పోలీసుల కాల్పుల్లో చనిపోయిన నంబాల కేశవరావు మృతదేహాన్ని ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్టప్రకారం కేసులు పెట్టాలని, 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఒక ఫ్యూడల్, గూండా, ఫాసిస్ట్ పాలనకు నిదర్శనం అని అన్నారు. మావోయిస్టులు లొంగిపోతామన్నా, చర్చలకు సిద్ధం అని ప్రకటించినా హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, కానీ ఒక్క నంబాల కేశవరావును చంపితే దేశంలో కోట్లాది మంది స్పందించారని, అదీ కమ్యూనిస్టులకు ఉన్న మానవతావాదానికి నిదర్శనం అని అన్నారు. కూనంనేని మాట్లాడుతూ 140 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని డిమాండ్ చేశారు. అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే అన్ని జిల్లాలకు సాగునీరు అందేదని చెప్పారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఇవ్వలేదని, నేడు పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, ప్రజలపై భారం మోపే కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని అన్నారు. దాని నిర్వహణ కోసం ఏటా వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దు అని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం%% కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు నేడు నోరు మూసుకున్నారని, తన మెదడును కరిగించి డిజైన్ చేశానని, కాళేశ్వరం కు అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ బాధ్యత ఇంజనీర్ లదే అని నేడు తప్పించుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును మహారాష్ట్ర అనుమతి ఇవ్వలేదని, అందుకే కాళేశ్వరం కు మార్చామని హరీశ్ రావు అంటున్నారని, అలా అని జనాలను ముంచే ప్రాజెక్టు కడతారా అని ప్రశ్నించారు.

## యువకుడి దారుణ హత్య...

**బలగం టీవీ, గంభీరావుపేట**

గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన గంభరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగన్నపేట గ్రామానికి చెందిన మెండే సతీష్ (33) వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం లింగన్నపేట గ్రామ శివారులోని సాత్ నెంబర్ కాలువ దుంకుడు రాళ్ల వద్ద సతీష్ తలపై గుర్తు తెలియని వ్యక్తులు బీరు బాటిల్స్ తో కొట్టి హత్య చేసినట్లుగా తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై ప్రేమ్ నందం సంఘటనా స్థలానికి చేరుకొని మిస్టరీ కేసుగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లుగా తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్యకు దారి తీసిన కారణాలు తెలియాల్సి ఉంది..

## గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,వేములవాడ:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడ సమీపంలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియామకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయని వివరించారు.




## రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత

- **మండల కేంద్రంలో రక్తదానంపై గిరిజన కళాశాల విద్యార్థుల అవగాహన ర్యాలీ**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన ప్రభుత్వ డిగ్రీ మహిళ కళాశాల టీజీ టీ డబ్ల్యూ ఆర్ డి సి డబ్ల్యూ, సిరిసిల్ల కు చెందిన యన్ ఎస్ ఎస్ మరియు యన్ సీసీ యూనిట్లు సంయుక్తంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు "రక్తదానం మానవత్వానికి ప్రతీక", "ఒక చుక్క రక్తం – ఒక ప్రాణానికి ఆశ" వంటి నినాదాలతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో రక్తదానం పై అవగాహన కల్పించారు. ప్లకార్డులు మరియు నినాదాలతో ప్రజలకు విజ్ఞానాన్ని చేరవేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. జయ మాట్లాడుతూ 2025 ప్రపంచ రక్తదాన దినోత్సవ నేపథ్యం "గివ్ బ్లడ్,గివ్ హోప్ టుగెథెర్ వి సేవ్ లైవ్స్" ను వివరిస్తూ "రక్తదానం ఒక పుణ్య కార్యం. యువత ఈ సేవలో ముందుండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. ర్యాలీలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే. వాణిశ్రీ, ఎన్ సీసీ సి టి ఓ ఏ.శ్రీకళ,పి ఐ స్టాఫ్ రమేష్,అధ్యాపకులు, విద్యార్థులు, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## 'ఎస్సీ వర్గీకరణ విజయం, రాజ్యాధికారమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్'

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

35 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత సాధించిన ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ విజయాన్ని పురస్కరించుకుని, మహనీయుల ఆశయ సాధన, రాజ్యాధికారమే లక్ష్యంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, గంభీరావుపేట మండల ఇంచార్జ్ మంగలి చంద్రమౌళి మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు సాగాలని ఆయన గంభీరావుపేట ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, విద్యార్థి మేధావులకు, రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, వివిధ కుల సంఘాల నేతలకు, యువజన సంఘాల ప్రతినిధులకు సామాజిక ఉద్యమాభివందనాలు తెలియజేశారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధించినందుకు అందరికీ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేసిన చంద్రమౌళి మాదిగ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షీరామ్ వంటి మహనీయుల ఆలోచన విధానాలను, ఆశయాలను అమలు చేయడానికి కంకణబద్ధులై ఉండాలని అన్నారు. "ఈ దేశానికి మేం పాలకులమవుతాం" అని ప్రతి ఒక్కరూ తమ ఇంటి గోడల మీద రాసుకొని బయలుదేరాలని ఆయన ఉద్బోధించారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, వికలాంగుల ఆత్మబంధువుగా, మాదిగల ఆరాధ్య దైవంగా, ఎక్కడ అన్యాయం జరిగినా అండగా నిలిచే మహానేత గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కలిసి నడవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్వార్థాన్ని వీడి సమాజ బాగోగుల కోసం పని చేయాలని, ధర్మాన్ని పాటించి దేశాన్ని రక్షించడానికి, కులాల గౌరవాన్ని నిలపడానికి ముందుకు నడవాలని కోరారు. "దేశం నాకేమిచ్చింది అనేది కాదు, దేశానికి నేనేమి ఇచ్చాను" అనే సూక్తితో ముందుకు సాగుదామని పేర్కొన్నారు.

## భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శనివారం చెక్కులను పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు వేములవాడలోని 10 మందికి చెక్కులు అందజేశారు.



## వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధికి కృషి...



**బలగం టీవీ, వేములవాడ**

రాజకీయాలకు అతీతంగా వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో 5,6,9,10 వార్డుల్లో పలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్,పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని,గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం హయంలో పడవు పడ్డా పనులను పూర్తి చేస్తున్నామని అన్నారు.ఇప్పటికే పట్టణంలో పలు సామాజిక భవనల కు నిధులు ఇవ్వడం జరిగిందని, నాంపల్లిలో మహిళా సంఘ భవనానికి,కమ్యూనిటీ భవన నిర్మాణ కోసం నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు చెప్పేది వింటూ ముందుకు పోతున్నామని,ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు.. గత ప్రభుత్వం పది సంత్సరాలలో మంజూరు చేయని నూతన రేషన్ కార్డులు ప్రజా ప్రభుత్వంలో మంజూరు చేయడం జరిగిందని,పేద ధనిక తేడా లేకుండా రేషన్ కార్డు ఉన్నా వారికి సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు కోసం 47 కొట్లు మంజూరు చేయడం జరిగిందని,శుక్రవారం 40 మందికి నష్ట పరిహారం అందించడం జరిగిందని అన్నారు. త్వరలోనే రోడ్డు వెడల్పు,ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని,రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మీ ఆశీర్వాదాలు అందజేయాలని అన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు రని వారు ఎలాంటి ఆందోళనలు చెద్దవద్దని,మరో విడుతలో తప్పకుండా ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు.ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ అన్వేష్ , మాజీ కౌన్సిలర్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ ఆందోళన..





- **రోడ్డుపై ఆందోళన చేపట్టిన మృతుని బంధువులు**

**బలగం టీవీ, గంభీరావుపేట**

మృతి చెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని, హత్య చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని సిద్దిపేట కామారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. సుమారు గంటపాటు ఆందోళన నిర్వహించారు. కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, హత్య చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసే అంతవరకు ఆందోళన విరమించేది లేదు అని భీష్మించుకుని కూర్చున్నారు.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపేట గ్రామానికి చెందిన మెండే సతీష్ ను శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాలతో కొట్టి దారుణంగా హత్య చేశారు. మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం రాత్రి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సతీష్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు నిందితులను అరెస్టు చేసే వరకు, మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు అంతక్రియలు నిర్వహించేది లేదు అంటూ డిమాండ్ చేస్తూ, రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సంఘటన స్థలానికి చేరుకున్న సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి నిందితులను 24 గంటల్లో అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, తంగళ్ళపల్లి సిఐ మొగిలి, పలు మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు కార్యక్రమం

- **మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య అధికారి డాక్టర్ కార్తీక్**

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తండగొండ గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహనను టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య అధికారి డాక్టర్ ఆర్.కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ: షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాళికా వ్యాధులు, పొగ తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, క్షయ లక్షణాలు రెండు వారలకు మించి దగ్గు జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం,బరువు తగ్గడం ఉన్నవారు,తేమడ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించిన కార్యక్రమంలో 84 మందికి పైగా టీబీ స్క్రీనింగ్ చేశామని, 22 మంది అనుమానితుల నుండి తేమడ నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపించమన్నారు. 7 మంది సింటామెటిక్ వాళ్ళని ఎక్సరే వేములవాడ ఏరియా హాస్పిటల్ కు పంపించామని, అందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికీ 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. అలాగే నిక్షయ్ పోషన్ ద్వారా వ్యాధిగ్రస్థులకు నెలకి 1000/- రూపాయలు పౌష్టికహారం కోసం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, సూపర్వైజర్లు, శశికుమార్, హేమలత, ( ఎస్.టి.ఎస్) గంగాధర్,ఎం.పి.హెచ్.ఎ లింగం కుమార్, అశోక్, ఏ.ఎన్.ఎం వసంత, ఉష, శ్యామల, ఆశ వర్కర్లు సునీత, అన సూర్య, లత, బాబు మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెస్ట్ ఛాంపియన్స్‌గా దక్షిణాఫ్రికా

- వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై ఘన విజయం
- 5 వికెట్ల తేడాతో గెలుపు
- 27 ఏండ్ల తర్వాత ఐసీసీ టైటిల్



**బలగం టీవీ, హైదరాబాద్**

సౌతాఫ్రికా చరిత్ర సృష్టించింది. లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023–25 ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో గెలిచి సఫారీ జట్టు టైటిల్‌ను అందుకుంది. దీంతో 1998 నాకౌట్ ట్రోఫీ అనంతరం సౌతాఫ్రికా గెలిచిన రెండవ ఐసీసీ టైటిల్ ఇదే కావడం విశేషం.చివరి రోజు ఆటను 213/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ప్రారంభించిన సౌతాఫ్రికా, 83.4 ఓవర్లలో 5 వికెట్లకు 282 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ మార్క్‌రమ్ 207 బంతుల్లో 14 ఫోర్లతో 136) చారిత్రాత్మక శతకం సాధించగా, టెంబా బవుమా (66), బెడింగ్‌హమ్ (21 నాటౌట్ ) సమష్టిగా జట్టు విజయానికి తోడ్పడ్డారు. చివర్లో మార్క్‌రమ్ ఔటైనా, బెడింగ్‌హమ్–వెర్రెన్నే (4 నాటౌట్) జోడీ విజయాన్ని పూర్తిచేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు తీసా డు, ప్యాట్ కమిన్స్, జోష్ హజెల్‌వుడ్ చెరో వికెట్ తీసారు.



**స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 (స్మిత్ 66, వెబ్‌స్టర్ 72బీ రబడా 5/51)

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 (బెడింగ్‌హమ్ 45బీ కమిన్స్ 6/28)

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 (స్టార్క్ 58 నాటౌట్‌బీ రబడా 4/59)

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్క్‌రమ్ 136, బవుమా 66)




# ఆకట్టుకుంటున్న కన్నప్ప ట్రైలర్

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప'. ముకేష్ కుమార్ సింగ్ తెరకెక్కించిన ఈ సినిమాలో శివుడి పరమ భక్తుడు తిన్నడుగా విష్ణు నటించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. "తిన్నడు నివసించే గూడెంలో ఉన్న శివ లింగాన్ని కొందరు స్వాధీనం చేసుకోవాలని భావిస్తారు. ఈ క్రమంలో వారిని తిన్నడు ఎలా ఎదుర్కొన్నాడు.. మొదట శివుడు అంటే నచ్చని తిన్నడు.. శివుడికి పరమ భక్తుడు ఎలా అయ్యాడు?" అనే ఇంట్రెస్టింగ్ సన్నివేశాలతో ట్రైలర్‌ను రూపొందించారు. రెబల్ స్టార్ ప్రభాస్ రుద్రుడిగా, బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ పరమ శివుడిగా, హీరోయిన్ కాజల్ అగర్వాల్ పార్వతీ దేవీగా నటించారు. ఇక, మలయాళ మెగాస్టార్ మోహన్ లాల్, మంచు మోహన్ బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా జూన్ 27న విడుదల కానుంది. శివ భక్తుడైన కన్నప్ప జీవిత గాథ ఆధారంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో తీర్చిదిద్దుతున్నారు

# దర్శకుడిగా నటుడు రాహుల్ రామకృష్ణ

**బలగం టీవీ, హైదరాబాద్**

త్వరలో మరో హాస్య నటుడు మెగాఫోన్ పట్టనున్నాడు. నటుడు రాహుల్ రామకృష్ణ ఇప్పుడు దర్శకుడిగా మారి మెగాఫోన్ పట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 'అర్జున్ రెడ్డి', 'భరత్ అనే నేను', 'జాతిరత్నాలు' వంటి విజయవంతమైన చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి విశేష ప్రేక్షకాదరణ పొందిన ఆయన తాజాగా ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. "దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫోటోలను నా మెయిల్‌కు పంపించండి" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆయనే నిర్మాతగా వ్యవహరించనున్నారని సమాచారం.



రాహుల్ రామకృష్ణ తన తొలి దర్శకత్వ ప్రయత్నానికి సంబంధించిన కథను ఇప్పటికే పూర్తిచేశారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా కోసం నటీనటుల ఎంపిక ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. రాబోయే కొద్ది నెలల్లో ఈ సినిమాకు సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి. నటనతో పాటు గతంలో రచయితగా, జర్నలిస్టుగా కూడా పనిచేసిన అనుభవం రాహుల్ రామకృష్ణకు ఉంది.

# ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి శ్రీలీల లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**


నటి శ్రీలీల పుట్టిన రోజు సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్ర బృందం ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా బర్త్‌డే విషెస్ తెలియజేసింది. ఈ పోస్టర్‌లో శ్రీలీల చాలా క్యూట్‌గా కనిపిస్తోంది. చేతిలో కాఫీ కప్ పట్టుకుని నిలుచొని సింపుల్ లుక్‌తో అదరగొడుతుంది. శ్రీలీల లుక్ తన అభిమానులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇటీవలే పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టగా, ఆయనతో పాటు శ్రీలీల కూడా జాయిన్ అయింది. వీలైనంత త్వరగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు. ప్రస్తుతం శ్రీలీల చాలా బీజీగా ఉంది. ఆమె చేతిలో అరడజను పైగా సినిమాలు ఉన్నాయి. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర', అక్కినేని అఖిల్ సరసన 'లెనిన్', తమిళంలో శివ కార్తికేయన్ సరసన 'పరాశక్తి', హిందీలో కార్తీక్ ఆర్యన్‌కు జోడీగా 'ఆషిఖి 3', కిరీటి రెడ్డి హీరోగా తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'జూనియర్' చిత్రాల్లో శ్రీలీల నటిస్తోంది. ఇందులో రెండు మూడు సినిమాలు హిట్ అయిన ఇక శ్రీలీలకి తిరుగు లేదు.




# 'కుబేర' ట్రైలర్ విడుదల వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం కుబేరా. ధనుష్, నాగార్జున, రష్మిక మందాన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ట్రైలర్‌ను మొదటగా జూన్ 13న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరగడంతో ట్రైలర్ విడుదల వాయిదా వేసి జూన్ 14న విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే తాజాగా జూన్ 14న కూడా ట్రైలర్ విడుదలను వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ సినిమా ట్రైలర్‌ను జూన్ 15న జరుగబోతున్న కుబేర గ్రాండ్ ప్రీ–రిలీజ్ ఈవెంట్లో విడుదల చేయబోతున్నట్లు తాజాగా ప్రకటించింది.



# స్క్విడ్‌గేమ్ 3' ఫైనల్ ట్రైలర్ విడుదల..

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' చివరి సీజన్ జూన్ 27 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా ఫైనల్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే, కథానాయకుడు సియోంగ్ గీ–హున్ (లీ జంగ్–జే) ఈ ప్రాణాంతక ఆటకు ఎలా ముగింపు పలుకుతాడు, అలాగే ఈ గేమ్ వెనుక ఉన్న ఫ్రంట్ మ్యాన్‌ను కనిపెట్టాడా లేదా అనే అంశాలు ఈ సీజన్‌లో ప్రధానంగా చూపించనున్నారని స్పష్టమవుతోంది. మొదటి రెండు సీజన్‌లలో భారీ విజయాన్ని సాధించిన ఈ కొరియన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్, తెలుగుతో పాటు అనేక భారతీయ భాషల్లోనూ అందుబాటులో ఉండనుంది. ఈ చివరి సీజన్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ వెబ్ సిరీస్‌కు హ్వాంగ్ డాంగ్ హ్యుక్ దర్శకత్వం వహించారు.

# కెన్యాకు మహేష్‌బాబు, రాజమౌళి

**బలగం టీవీ, హైదరాబాద్**



దర్శక ధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబోలో తెరకెక్కుతున్న 'ఎస్–ఎస్ఎంబీ29' మూవీపై మరో క్రేజీ న్యూస్ వైరలవుతోంది. ఈ ప్రాజెక్ట్ కొత్త షెడ్యూల్ షఉటింగ్ కెన్యాలో జరగనున్నట్లు తెలుస్తోంది.కొత్త షెడ్యూల్ కెన్యాలో జులై రెండో వారంలో ప్రారంభం అవుతుందనే టాక్ వినిపిస్తోంది. దీని కోసం రాజమౌళి సహా మూవీ టీం అక్కడికి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. దాదాపు నెల రోజుల పాటు మహేష్ బాబుపై భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఛేజ్ సీక్వెన్స్‌లు చిత్రీకరించనున్నారనే టాక్ వినిపిస్తోంది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లపై కూడా కీలక సీన్స్ షూటింగ్ చేసే ఛాన్స్ ఉంది. కెన్యాలోని అటవీ ప్రాంతంలో ఈ షెడ్యూల్ ప్లాన్ చేశారట జక్కన్న. ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లోనూ షూటింగ్ చేయబోతున్నారని.. ఇప్పటికే కావాల్సిన అన్నీ అనుమతులు మూవీ టీంకు లభించాయని తెలుస్తోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ ఒడిశాలోని సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్ సీల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సీన్స్ షూట్ చేశారు. ఇండియన్ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌ను భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు

# నటుడు గోపాలరావు కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. సుప్రసిద్ధ సినీ, టీవీ నటుడు అల్లం గోపాలరావు (75) కన్నుమూశారు. శనివారం ఉదయం 8 గంటలకు తన నివాసంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తెలుగు సినీ, టీవీ రంగాల్లో విషాదం నెలకొంది. గోపాలరావుకు భార్య విమల, ఇద్దరు కుమారులు అనిల్, సునీల్ ఉన్నారు. పెద్ద కుమారుడు అనిల్ కూడా సీరియల్స్‌తో పాటు సినిమాల్లో నటిస్తున్నారు. గోపాలరావు పార్థివ దేహాన్ని పలువురు సినీ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ మేనేజ్‌మెంట్ కమిటీ గోపాలరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది.

# అంగరంగవైభవంగా గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం హైటెక్స్ లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అద్భుతంగా నిర్వహించారు. ఈ వేడుకలో సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఇక కళారంగంలో అత్యంత ప్రతిభ కనపర్చిన వారికి అవార్డులను అందించారు. అంతేకాకుండా ప్రశంసా పత్రంతో పాటు క్యాష్ ప్రైజ్ ను కూడా అందించారు. మణిరత్నం, సుహాసిని, మురళీ మోహన్, జయసుధ, జయప్రద, అల్లు అర్జున్, నందమూరి బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, రీతూ వర్మ, నివేదా థామస్, అనన్య నాగళ్ల తదితరులు పాల్గొన్నారు.

















